

నేడు విద్యా సంస్థలకు సెలవు

పాడేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో సోమవారం అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ప్రకటించారు. భారీ వర్షాలతో గెడ్డలు, వాగులు పొంగుతుండడంతోపాటు వర్షాల వల్ల పాఠశాలల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో సోమవారం సెలవు ప్రకటించారు. జిల్లాలోని అన్ని విద్యాలయాలు సెలవు పాటించాలని ఆయన ఆదేశించారు.



చింతపల్లి మండలం కప్పల గ్రామం వద్ద వరదకు కొట్టుకుపోయిన కల్వర్టు



రహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న బెన్నవరం సుందరకోట వాగు

వర్ష బీభత్సం

పొంగి ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు

- నీట మునిగిన పంట పొలాలు
- జీకే వీధి మండలంలో వంతెన, చింతపల్లి మండలంలో కల్వర్టు కొట్టుకుపోయిన వైనం
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- అరకులోయ మండలంలో ఇళ్లల్లోకి వర్షపు నీరు
- ఘాట్ మార్గాల్లో రాకపోకలు నిషేధం
- కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది నిరంతర సేవలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏజెన్సీలో ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, చింతపల్లి మండలాల్లో గెడ్డల అవతల ఉన్న గ్రామాల గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని అధికారులు సూచిస్తున్నారు.

తాజా వర్షాలకు జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లాలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు 21.8 మిల్లీ మీటర్లు, అలాగే ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 35.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం జిల్లాలోని వై.రామవరంలో అత్యధికంగా 74.2 మిల్లీమీటర్లు, వీఆర్ పురంలో అత్యల్పంగా 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం కంట్రోల్ రూమ్‌లో రెండు ఫోన్ నంబర్లు: 08935 299912, 08935 293448 అందుబాటులో ఉంచామని, నిరంతరం కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న అన్నవరం వాగు



సీలేరు: ధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటుతున్న దృశ్యం

జిల్లాలో శని, ఆదివారం నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో) వివరాలు..

వ. సం. మండలం	శనివారం ఉ.8.30 నుంచి ఆదివారం ఉ.8.30 వరకు	ఆదివారం ఉ.8.30 నుంచి సా.6.30 వరకు
1. ఎటపాక	22.4	15.2
2. కూనవరం	18.8	13.4
3. చింతూరు	38.2	9.6
4. వీఆర్.పురం	9.6	7.6
5. ముంచంగిపుట్టు	34.8	72.6
6. పెదబయలు	25.6	46.2
7. డుంబ్రిగుడ	25.8	35.4
8. అరకులోయ	30.4	22.4
9. అనంతగిరి	18.2	13.8
10. హుకుంపేట	19.4	33.2
11. పాడేరు	13.8	33.4
12. జి.మాడుగుల	13.6	20.2
13. చింతపల్లి	20.4	47.4
14. జీకేవీధి	24.2	35.2
15. కొయ్యూరు	30.2	20.8
16. మారేడుమిల్లి	28.8	38.6
17. దేవీపట్నం	20.4	27.6
18. వై.రామవరం	39.6	74.2
19. అడ్డతీగల	8.2	69.4
20. రాజవొమ్మంగి	8.4	53.0
21. గంగవరం	5.2	68.2
22. రంపచోడవరం	22.6	32.4



అరకులోయ మండలం మాడగడ గ్రామంలో ఇంట్లోకి వచ్చిన వర్షపు నీరు

ఇళ్లల్లోకి వరద నీరు

జీకేవీధి మండలంలో చామగెడ్డ వంతెన, చింతపల్లి మండలంలోని బెన్నవరం పంచాయతీ కప్పల గ్రామం వద్ద కల్వర్టు ఆదివారం కొట్టుకుపోయాయి. అరకులోయ మండలం మాడగడ గ్రామంలో భారీ వర్షాలకు ఆరు ఇళ్లలోకి వర్షపు నీరు రావడంతో గిరిజనులు రోడ్డున పడ్డారు. చింతపల్లి- లంబసింగి ఘాట్ మార్గంలో కొండపై నుంచి బండరాళ్లు రోడ్డుపైకి వచ్చిపడ్డాయి. చింతపల్లి మండలం బలపం ప్రాంతాల్లో వరద ఉధృతికి వరి పంట పొలాలు కొట్టుకుపోగా, లక్కవరం, ఎర్రగొండ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరింది.

అరకులోయలో..

అరకులోయ: మండలంలో కురిసిన భారీ వర్షాలకు జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. మాడగడ వద్ద సన్‌రైజ్ హిల్స్‌కు రహదారి నిమిత్తం మట్టిని తవ్వి రోడ్డు పక్కన వేయడంతో భారీ వర్షాలకు ఆ బురద అంతా ఓ వీధిలోకి కొట్టుకొచ్చింది. దీంతో ఎనిమిది ఇళ్లను వర్షపు నీరు ముంచెత్తింది. బాధితులను మాడగడ సర్పంచ్ పాడిబారికి జ్యోతి తదితరులు పరామర్శించి, వారికి సహాయమందించారు. కాగా గాలికొండ వ్యూపాయింట్ - బీసుపురం కాఫీ తోటల మధ్య రహదారిపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలో శనివారం ... మిగతా 8వ పేజీలో

ఘాట్ మార్గాల్లో రాకపోకలు బంద్

పాడేరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మూడు ఘాట్ మార్గాల్లో రాకపోకలను నిషేధిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఘాట్ మార్గాల్లో చెట్లు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున సోమ, మంగళవారాలు పాడేరు, అరకులోయ, లంబసింగి ఘాట్ మార్గాలు మూసివేయాలని, ఆయా మార్గాల్లో వాహనాలను అనుమతించవద్దని రెవెన్యూ పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

డొంకరాయికి వరద ప్రవాహం

- జలాశయం నుంచి 13,200 క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు, సెప్టెంబరు 8: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు వచ్చి చేరుతుండడంతో జలాశయం 4 గేట్లు ఎత్తి 13,200 క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1,037 అడుగులు కాగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి 12,500 క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి 3,800 క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్ ద్వారా విడుదల చేస్తూ జలాశయంలో నీటిమట్టం పెరగకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 1036.70 అడుగుల నీటిమట్టం కొనసాగుతున్నది. జలాశయానికి ఇన్‌ఫ్లో ఇంకా పెరిగితే నీటిని విడుదల చేయడానికి జెన్‌కో అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఆదేశించారు. కాగా డొంకరాయి ఏపీపీ డ్యామ్ నుంచి కూడా రెండు గేట్లు ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

నిండు కుండలా జోలాపుట్టు, డుడుమ

- జోలాపుట్టు నుంచి దిగువకు 13 వేల క్యూసెక్కులు
- డుడుమ నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు విడుదల

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 8: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు వరద నీరు పోటెత్తింది. డుడుమ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2,590 అడుగులు కాగా, ఆదివారం 2,587.20 అడుగులకు చేరింది. అలాగే ఈ జలాశయం ఎగువ ప్రాంతంలో గల జోలాపుట్టు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2,750 అడుగులు కాగా, ప్రస్తుతం 2,548.00 అడుగులకు చేరింది. జోలాపుట్టు జలాశయానికి ఆనుకొని ఉన్న స్పిల్‌వే డ్యామ్ నిండిపోయింది.



జోలాపుట్టు స్పిల్‌వే గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

దిగువకు నీరు విడుదల

ముందస్తు చర్యల్లో భాగంగా జోలాపుట్టు నుంచి దిగువకు 13 వేల క్యూసెక్కులు, డుడుమ నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు విడుదల అధికారులు ఆదివారం విడుదల చేశారు. ప్రతి గంటకు నీటి లెవెల్స్‌ను తెలుసుకుంటున్నామని, దాని ఆధారంగా నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

పండగపూట విషాదం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు దుర్మరణం
- పాయకరావుపేట మండలంలో ఇద్దరు, రావికమతం మండలంలో ఒకరు..

- 8లో

అంతిమ యాత్రకూ తప్పని కష్టాలు

- తాడు సహాయంతో గెడ్డ దాటిన గిరిజనులు



తాడు సహాయంతో గెడ్డలో నుంచి పాడెను మోసుకుంటూ వెళుతున్న సర్పంచ్, గిరిజనులు

అనంతగిరి, సెప్టెంబరు 8: అంతిమ యాత్రకు కూడా గిరిజనులకు కష్టాలు తప్పలేదు. ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలో నుంచి తాడు సహాయంతో పాడెను మోసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ తముటు గ్రామానికి చెందిన సివేరి చిన్నయ్య(60) అనే గిరిజనుడు శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం దహన సంస్కారాలు చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. అయితే భారీ వర్షాల వల్ల తముటు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పినకోట సర్పంచ్ గణేశ్ స్థానిక గిరిజనులతో కలిసి గెడ్డపై తాడును ఏర్పాటు చేశారు. ప్రాణాలకు తెగించి గిరిజనులు తాడు సహాయంతో పాడెను మోసుకుంటూ గెడ్డను దాటారు. అధికారులు స్పందించి తముటు గెడ్డపై వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు.

జై జై గణేశా..



జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా పందిర్లు వెలిశాయి. వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు చేశారు.

ముంచంగిపుట్టు ఐటీడీఏ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన భారీ గణపతి ప్రతిమ

పొంగుతున్న నదులు, వాగులు

వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల పంట పొలాలను ముంచెత్తాయి. కల్వర్టులు దెబ్బతిన్నాయి. చెరువులు, మినీ రిజర్వాయర్ల పొర్లుకట్టు పొరుతున్నాయి..


గొలుగొండ: రావణాపల్లి రిజర్వాయర్ పొర్లుకట్టు నుంచి పారుతున్న నీరు


గూడెంకొత్తవీధి: కూలిపోయిన చామగెడ్డ వంతెన


అనకాపల్లి టౌన్: జలమయమైన అనకాపల్లి పీటీడీ కాంప్లెక్సు


రాంబిల్లి: నారాయణపురం వద్ద జోరుగా ప్రవహిస్తున్న మైనర్ శారదా నది


కోటవురట్ల: పాతరోడ్డు వద్ద పరవళ్లు తొక్కుతున్న వరహా నది


రాంబిల్లి: పంచదార్ల రాజుకోడూరులో వరి పొలాలు మునిగి పోయిన దృశ్యం


అరకులోయ: మాడగడ గ్రామంలో ఇళ్లలోకి వచ్చిన బురద

క్రైం... crime news

హార్డ్‌వేర్, పెయింట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం

» రూ.40 లక్షల ఆస్తి నష్టం


హార్డ్‌వేర్ దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు

రావికమతం, సెప్టెంబరు 8: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రావికమతంలో దాచేపల్లి రామారావు(నానాజీ)కి చెందిన హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ దుకాణంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించిందని స్థానికులు అంటున్నారు. రెండు అంతస్తులలో ఉన్న పెయింట్‌లు, పీవీసీ పైపులు తదితర సామగ్రి దగ్ధమయ్యాయి. దీంతో మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకొని పైఅంతస్థులో మంటల్లో చిక్కుకున్న ఒక వ్యక్తిని ఎస్ఐ ధనుంజయనాయుడు సాహసంతో రక్షించారు. రావికమతం, చోడవరం అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, టీడీపీ నాయకులు వచ్చి బాధితుడు రామారావును పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై జిల్లా కలెక్టరుతో మాట్లాడి నష్ట పరిహారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బాధితుడికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ సభ్యులు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, పులగాయల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగికి తీవ్ర గాయాలు

కొయ్యూరు, సెప్టెంబరు 8 : చింతాలమ్మ గుడి సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఎం.మాకవరం గ్రామ సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ త్రినాథ్ తీవ్రంగా గాయపడ్డారు. మాకవరం నుంచి కృష్ణాదేవిపేట బైక్‌పై వెళుతున్న త్రినాథ్‌ను ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని కుడికాలు రెండు చోట్ల విరిగింది. స్థానికులు సహచర ఉద్యోగులకు తెలియజేయడంతో రావణాపల్లికు చెందిన పవన్‌తో పాటు పంచాయతీరాజ్ జేఈఈ రామకృష్ణ నర్సీపట్నం ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనపై బాధిత కుటుంబం కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరింత కుంగిన రామచంద్రపురం వంతెన

» ఆర్అండ్‌బీ అధికారుల పరిశీలన

» నేటి నుంచి రాకపోకలు నిలుపుదల


కుంగిపోయిన వంతెనను పరిశీలిస్తున్న ఈఈ రమేశ్, అధికారులు

కోటవురట్ల, సెప్టెంబరు 8: మండలంలోని రామచంద్రపురం జంక్షన్ వద్ద వంతెన మరింత కుంగింది. రెండు నెలల క్రితం ఈ వంతెన కుంగడంతో హెచ్చరిక బోర్డులు పెట్టినా ఎవరు పట్టించుకోకుండా యధావిధిగా వాహనాలు నడిపారు. వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భారీ వాహనం వెళ్లడంతో ఒకసారిగా వంతెన మూడు అడుగుల కుంగిపోయింది. సమాచారం తెలుసుకున్న ఆర్అండ్‌బీ ఈఈ రమేశ్, డీఈఈ నాగమోహనరావు, ఏఈ నారాయణరెడ్డి, అధికారులు, పోలీసులు వచ్చి పరిశీలించారు. వెంటనే వంతెన పక్కన డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు విషయమై మంత్రి వంగలపూడి అనితతో అధికారులు ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే డైవర్షన్ పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. సోమవారం నుంచి వాహనాల రాకపోకలను నిషేధించారు. ఈ వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు. దీంతో నర్సీపట్నం నుంచి కోటవురట్ల మీదుగా రేవుపోలవం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా నర్సీపట్నం ఆర్అండ్‌బీ ఈఈ రమేశ్ మాట్లాడుతూ రామచంద్రపురం వంతెన కుంగిపోవడం జరిగిందని, దీని స్థానంలో కొత్త వంతెననిర్మాణానికి ప్రభుత్వం రూ. రెండు కోట్లు, డైవర్షన్ రోడ్డు కోసం రూ.150లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. డైవర్షన్ రోడ్డు పనులు సోమవారం నుంచి ప్రారంభిస్తామన్నారు.వారితోపాటు ఎస్ఐ రమణయ్య టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకిశ్రీనివాసరావు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా మీసాల సుబ్బన్న



నర్సీపట్నం, సెప్టెంబరు 8 : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా సీనియర్ నాయకుడు మీసాల సుబ్బన్నను ఏఐసీసీ నియమించింది. 1980వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నుంచి అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. పార్టీలోనే ఆయన కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో నామినేటెట్ పోస్టులతో పాటు పార్టీలో అనేక కీలక పదవులు చేపట్టారు. మీసాల సుబ్బన్నను డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

ఎడతెరిపి లేని వాన

» జాతీయ రహదారిపై కొప్పాక వద్ద నిలిచిన వర్షపు నీరు

» ఇబ్బందులు పడ్డ వాహనచోదకులు

» పొంగి ప్రవహిస్తున్న శారదా, మైనర్, మేజర్ నదులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8:
వాయుగుండం ప్రభావంతో జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో 35.0 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. పట్టణంలో జనజీవనం స్తంభించింది. జనాలు ఇళ్లల్లోంచి బయటకు రావడానికి సాహసించలేదు. ఆదివారం కావడంతో కూరగాయలు కొనుగోలు చేయడానికి బయటకు వచ్చిన ప్రజలు తడిసి ముద్దయి ఇంటికి చేరారు. లోతట్టు ప్రాంతాల వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిలోని కొప్పాక వద్ద విశాఖ వెళ్లే మార్గంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి చెరువును తలపించింది. ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయింది. డిపోలోకి వెళ్లే కార్మికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో భారీ వాహనాలు లక్ష్మీదేవిపేట రైల్వేగేటు మీదుగా రాకపోకలు సాగించాయి.

పరవళ్లు తొక్కుతున్న శారదా నది

పట్టణంలో ఉన్న శారదానది ఉధృతంగా ప్రవహిస్తోంది. వాయుగుండం ప్రభావం కారణంగా ఎగువన ఉన్న రిజర్వాయర్ల గేట్లను ఎత్తివేయడంతో శారదానదిలో వరదనీటి ప్రవాహం జోరందుకుంది. ఘాట్‌కు ముందు ఉన్న మెట్లు మునిగిపోయాయి.


ఎలమంచిలి: రామారాయుడుపాలెం వద్ద రోడ్డుపై దెబ్బతిన్న కల్వర్టు


అనకాపల్లి టౌన్: కొప్పాక వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఉధృతంగా మేజర్, మైనర్ శారదా నదులు

రాంబిల్లి: వాయుగుండం ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయి కాలువలను తలపిస్తున్నాయి. వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి మీదుగా వాడనర్సాపురం వెళ్లే నేవీ రోడ్డులోని భారీ గోతులు వర్షపు నీటితో నిండిపోయి చెరువుల్లా తయారవ్వడంతో వాహనదారులు వాటిలో పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కొత్తూరు, నారాయణపురం వద్ద గల మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాయుగుండం కారణంగా వాడనర్సాపురం, కొత్తపట్నం, వాడపాలెం, వెంకయ్యపాలెం, లోవపాలెం గ్రామాల సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఆదివారం 21.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

దెబ్బతిన్న రామారాయుడుపాలెం కల్వర్టు

ఎలమంచిలి: వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలతో ఎలమంచిలిపట్టణంలోని పలు చోట్ల రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. వర్షాలకు మునిసిపాలిటీ రామారాయుడుపాలెం రోడ్డుపై ఉన్న కల్వర్టు దెబ్బతింది. యర్రవరం సమీపంలో పూడుకుపోయిన కాలువలను ఎక్స్‌కవేటర్‌తో ఏఈ గణపతి సుబ్బారావు తీయించారు. పట్టణంలోని పలు డ్రైన్‌లలో పూడికతీత పనులు చేపట్టారు.

పొంగుతున్న సర్పా, వరాహా నదులు

కోటవురట్ల : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సర్పా, వరాహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షానికి గెడ్డలు, వాగులు పొంగుతున్నాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంట పొలాలు నీటితో కళకళలాడుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతున్నది. మండలంలో 23.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ జానకమ్మ తెలిపారు.

అధ్వానంగా విశాఖ రోడ్డు

భారీ గోతులతో చెరువును తలపిస్తున్న రహదారి

» రాకపోకలకు నరకయాతన పడుతున్న వాహనదారులు

» రాంగ్‌రూట్‌లో వాహనాల రాకపోకలు

» పట్టించుకోని అధికారులు, పాలకులు


పెట్రోల్ బంకు సమీపాన దెబ్బతిన్న రోడ్డు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 : ఇది ఏజెన్సీ ప్రాంతంలోని రహదారి కాదు.. అలాగే జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంత రహదారి అంతకంటే కాదు.. సాక్ష్యాత్తూ జిల్లా కేంద్రమైన అనకాపల్లిలోని సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం. రెండు నెలలుగా రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.మూడు కోట్లకు పైగా నిధులతో సుంకరమెట్ట జంక్షన్ నుంచి హైవే వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా పాత చెరకుకాటా దాటిన తరువాత రోడ్డు విస్తరణకు ప్రైవేటు స్థలం అవసరం కావడంతో ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అయినప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధులు రోడ్డును ప్రారంభించేశారు. వర్షాలకు ఈ రహదారి పూర్తిగా ధ్వంసమై చెరువును తలపిస్తోంది. అనకాపల్లి నుంచి కొప్పాక, లంకెలపాలెం, అగనంపూడి, గాజువాక, విశాఖపట్నంలకు రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పరవాడ ఫార్మాసిటీలోని కంపెనీలకు ఉద్యోగులు వెళ్లాలన్నా.. విశాఖకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలన్నా.. లంకెలపాలెం, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, గాజువాక ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు ఈ మార్గమే గుండానే వెళ్లాలి. రహదారి గోతులమయం కావడంతో వాహనచోదకులు రాంగ్ రూట్‌లో పాత చెరకు కాటా సమీపం నుంచి జలగలమదుం జంక్షన్ వరకు వెళుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడిపే పరిస్థితి నెలకొంది. రహదారి నిర్మాణంపై అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని స్పందించడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడును వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే స్థలానికి సంబంధించి యజమానులతో ఉన్న సమస్య కొలిక్కి వచ్చిందన్నారు. త్వరలోనే రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

సినిమా షూటింగ్‌లకు ఏవోబీ అనుకూలం

» ప్రముఖ సినీ డైరెక్టర్ క్రిష్

» మాచ్‌ఖండ్ ప్రాజెక్టు, డుడుమ జలపాతాల సందర్శన


మాచ్‌ఖండ్ అధికారులతో మాట్లాడుతున్న ప్రముఖ డైరెక్టర్ క్రిష్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 8: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం సినిమా షూటింగ్‌లకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ప్రముఖ సినీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి రాధాకృష్ణ అన్నారు. అన్నీ కుదిరితే త్వరలో ఇక్కడ సినిమా షూటింగ్ చేస్తానని ప్రకటించారు. శనివారం డైరెక్టర్ క్రిష్, తన బృందంతో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, వించ్ హౌస్, డుడుమ జలపాతాలను సందర్శించారు. వించ్ మార్గంలో ప్రయాణించి జలవిద్యుత్ కేంద్రానికి చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణం, వించ్ పనితీరు, ఎటువంటి రహదారి సౌకర్యం లేని రోజుల్లో ఇటువంటి ప్రాజెక్టును నిర్మించడంపై క్రిష్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డుడుమ పరిసర ప్రాంతంలో షూటింగ్ అనుమతులపై ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా క్రిష్ మాట్లాడుతూ సరిహద్దులో ప్రకృతి అందాలు ఎంతో బాగున్నాయని, సినిమా షూటింగులకు చాలా బాగుంటుందన్నారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ చేసేందుకు అనుమతుల కోసం ఏపీజెన్‌కో వర్గాలను అడగడం జరిగిందని, అనుమతులు వస్తే ఈ ప్రాంతంలో షూటింగ్ చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లాలో పలు ప్రదేశాల్లో ప్రముఖ నటి అనుష్క శెట్టితో క్రిష్ సినిమా షూటింగ్ చేస్తున్నారు

భక్తులతో ఒడ్డిమెట్ట ఆలయం కిటకిట


ఒడ్డిమెట్ట ఆలయంలో భక్తులతో నిండిపోయిన క్యూ లైన్లు

నక్కపల్లి, సెప్టెంబరు 8: మండలంలోని ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయం వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడింది. కొండకు వెళ్లే మెట్లమార్గం, ఆలయంలో వున్న క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఏర్పాట్లను ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఈవోలు కిరణ్కుమార్, సాంబశివరావు, మురళీ పర్యవేక్షించారు. తొమ్మిది రోజులపాటు ఒడ్డిమెట్ట ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని వారు చెప్పారు. నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకుల స్వామివారిని దర్శించుకున్నారు.

ఎలమంచిలిలో చిక్కిన అలుగు

» స్వాధీనం చేసుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టిన ఫారెస్టు అధికారులు


వేమగిరి అటవీ ప్రాంతంలో అలుగును విడిచిపెట్టిన అధికారులు

ఎలమంచిలి, సెప్టెంబరు 8: ఎలమంచిలి ఎగువ ఉన్న పెదపల్లి అటవీప్రాంతం నుంచి ఇటీవల కురిసిన వర్షాలకు శేషుగెడ్డలో కొట్టుకు వచ్చిన అలుగు ఎన్టీఆర్ కాలనీకి చెందిన యువకుడి చేతికి చిక్కింది. దీని గురించి అంతగా తెలియని ఈ యువకుడి వద్ద నుంచి మరో యువకుడు తీసుకోవడంతో విషయం బయటకు పొక్కింది. ఈ సమాచారం ఎలమంచిలి అటవీ శాఖ అధికారులకు తెలియడంతో ఆ యువకుడి నుంచి అలుగును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీ అధికారుల ఆదేశానుసారం అలుగును ఎస్.రాయవరం మండలం వేమగిరి అటవీప్రాంతంలో శనివారం రాత్రి విడిచిపెట్టామని ఎలమంచిలి అటవీ అధికారి రమణ తెలిపారు.

చవితి వేడుకల్లో వెల్లివిరిసిన మత సామరస్యం

» వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు ముస్లిం కుటుంబం సాయం


వినాయకచవితి పూజలో స్థానిక యువకులతో కలిసి పాల్గొన్న ముస్లిం కుటుంబీకులు

చోడవరం, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. పట్టణంలోని ఎడ్ల వీధికి చెందిన షేక్ జానీ అనే ముస్లిం యువకుడి కుటుంబం వినాయకుడి పూజల్లో పాల్గొనడం విశేషం. షేక్ జానీకి ఇటీవల ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. దీంతో వినాయక విగ్రహాన్ని తానే కొనుగోలు చేసి ఏర్పాటు చేయించాడు. ఈ సందర్భంగా జానీ, అతని సోదరుడు, తల్లి మండపంలో కూర్చొని గణపతి పూజల్లో పాల్గొన్నారు. హిందువులతో కలిసి వినాయకుడి వేడుకల్లో ఇలా ఓ ముస్లిం కుటుంబం ఉత్సాహంగా పాల్గొనడం ఆదర్శంగా నిలిచింది.

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, సెప్టెంబరు 8 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తిని ఆదివారం రాత్రి పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌ల్లో రంధ్రాలు ఏర్పడడంతో గురువారం ఉత్పత్తి అర్ధాంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. అలాగే నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి శనివారం రాత్రి నిలిచిపోయింది. ఈ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించారు.

జాతీయ ఉత్తమ యోగా టీచర్‌గా పుల్లేటి సతీష్


జాతీయ స్థాయి అవార్డుతో పుల్లేటి సతీష్

చోడవరం,సెప్టెంబరు 8: పట్టణానికి చెందిన యోగా గురువు పుల్లేటి సతీష్‌కు జాతీయ ఉత్తమ యోగా ఉపాధ్యాయ అవార్డు లభించింది. గ్రామీణ ప్రాంతంలో యోగా శిక్షణ ఇవ్వడంతోపాటు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్న సతీష్‌కు బెంగళూరుకు చెందిన ప్రముఖ శివజ్యోతి యోగ కేంద్రం 2024 సంవత్సరానికి జాతీయ స్థాయి ఉత్తమ యోగా ఉపాధ్యాయునిగా అవార్డును ప్రకటించింది. సతీష్‌కు అవార్డు రావడంపై యోగా శిక్షణ కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, పట్టణ పిల్లల వైద్యులు బంగారు కృష్ణ అభినందించారు.


పాడేరు రూరల్ : పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో వినాయకుడు


డుంబ్రిగుడ : పూజలు అందుకుంటున్న గణేషుడు


కొయ్యూరు : ఎం.మాకవరంలో కొలువైన వినాయకుడు


సీలేరు : శివాలయం వీధిలో భారీ విగ్రహం


చింతపల్లి : సబ్ జైలులో చవితి పండగ సందడి


పాడేరు రూరల్ : నిమజ్జన సందడి

గణనాథుని పూజల్లో భక్త ‘గిరిజనం’

ఏజెన్సీలో ఘనంగా వినాయక నవరాత్రులు

ప్రతి గ్రామంలోనూ మండపాలు

ప్రత్యేక పూజలు, సాంస్కృతిక సందడి

పాడేరు రూరల్, సెప్టెంబరు 8 : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో వినాయక చవితి మహోత్సవాలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హిందువుల ప్రథమ మహోత్సవం వినాయక చవితి మహోత్సవాలను మూడు, ఐదు, తొమ్మిది రాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేసుకున్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటుకు భారీ మండపాలను ఏర్పాటు చేసి ఆనందోత్సాహంగా శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టారు.పట్టణంలోని అంబేడ్కర్ కూడలి, సినిమా హాలు సెంటర్, గుడివాడవీధి, లోచలిపుట్టు, సుంద్రుపుట్టు, పి.గొందూరు, శీలానగర్ కాలనీ, గడ్డికాలనీ తదితర 20 ప్రాంతాల్లో ఉత్సవ కమిటీల ప్రతినిధులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నవరాత్రులు నిర్వాహణకు విగ్రహాలను భారీగా ఏర్పాటు చేశారు.

చింతపల్లి : మండలంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం మండల కేంద్రంతోపాటూ పలు గ్రామాలు, వీధుల్లో భక్తులు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. షైలుకూలివీధి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిష్ఠించిన విగ్రహాలను విద్యార్థులు, స్థానిక యువత భారీ ఊరేగింపు నడుమ నిమజ్జనం చేశారు. సబ్ జైల్, ఆర్ అండ్ బీ, సంతబయలు, అంబేడ్కర్ కాలనీ, హనుమాన్ జంక్షన్, ఐటీడీఏ క్వార్టర్స్ వినాయక మండపాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఐటీడీఏ క్వార్టర్స్ మండపం వద్ద భారీ వర్షంలోనే భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక పూజల్లో వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జోగేశ్వర రావు, పెదిరెడ్ల బేతాళుడు, నాయకులు తాటిపాకల రమేశ్, నాగేశ్వరరావు, తాడి రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణమూర్తి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండలంలోని కించుమండలో వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం కేంద్రంతోపాటు కించుమండ, అరకు గ్రామాల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలను గిరిజనులు నిర్వహించారు. ప్రత్యేక మండపాల్లో వినాయకుడి పూజలు చేసి గిరిజనులు నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు.

హుకుంపేట : మండలంలోని ప్రతి గ్రామంలోనూ స్థానికులు వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. గిరిజన సంప్రదాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులు వినాయక పూజలు జరిపారు. ఇళ్లల్లో పూజలు నిర్వహించిన వారు ప్రతిమలను నిమజ్జనం చేశారు. మండపాల్లో వినాయక విగ్రహాల వద్ద విద్యుదీకరణ చేపట్టి అందంగా అలరించారు. మండల కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయం వద్ద స్థానిక గ్రామ దేవత శతకంపట్టు ఉపాధ్యాయుల క్వాటర్ కామయ్యపేట అడ్డుమండ వద్ద భారీసంఖ్యలో విగ్రహాలు ఏర్పాటు చేశారు.

కొయ్యూరు : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ గ్రామంలో భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. రాజేంద్రపాలెం, కొయ్యూరు, తోటలూరు, ఎం.మాకవరం తదితర గ్రామాలలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. విశ్వహిందూ పరిషత్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీలను ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమాలలో విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి చడ్డా వెంకటేశ్వర్లు, ఈరే మల్లిబాబు, డీవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వర్షం భారీగా కురుస్తుండడంతో మండపాల వద్ద చిత్తడి నెలకొని ఇబ్బందిగా మారింది.

సీలేరు : జీకేవీధి మండలం సీలేరులో శనివారం భక్తిశ్రద్ధలతో వినాయకచవితి నవరాత్రులను ప్రారంభించారు. పలు వీధుల్లో పోటాపోటీగా వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. 5 నుంచి 10 అడుగుల వరకు భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి మండపాలను అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక వర్తక సంఘం కార్యాలయం, అల్లూరి వీధి, కుమ్మర వీధి, దుర్గావీధి, శివాలయం వీధి, కన్నబ్బాయి క్యాంప్‌ల వద్ద భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.

పాడేరు రూరల్ : పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న వంతాడపల్లి గ్రామం వరకు అధిక సంఖ్యలో ప్రజలు విగ్రహాలు పూజలు చేపట్టిన పూలు, పత్రి తదితర సామగ్రితో వెళ్లి అక్కడ ప్రవహించే గెడ్డలో వాటిని కలిపి ఘనంగా అనుపోత్సవాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

పెదబయలు : మండలంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పెదబయలు మండల కేంద్రంలో స్థానిక దుర్గమ్మ ఆలయంలో యువ ఐక్య సంఘం ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేశారు. సీతగుంట గడ్డి కాలనీలో పంచాయతీలో ఏర్పాటు చేసిన పది అడుగుల ఎత్తు విగ్రహం ఆకట్టుకుంటోంది. మండల కేంద్రంలో యువ ఐక్య సంఘం వారు ఏర్పాటు చేసిన ఉత్సవంలో లడ్డూ వేలం పాట వేయగా గంపరాయి అజయ్‌కుమార్ రూ.5000కు కైవసం చేసుకున్నారు. గణేషుని అనుపు ఉత్సవంలో ఉత్సవ కమిటీ, యువత నృత్యాలతో సందడి చేశారు.

వర్ష బీభత్సం


తాజంగి జలాశయం నుంచి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

... 5వ పేజీ తరువాయి

అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తున్నది. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మండలంలో 47.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు ప్రధాన రహదారులు వాగులను తలపిస్తున్నాయి. చెరువూరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా తాజంగి జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. జలాశయం నుంచి దిగువకు భారీగా నీరు వెళుతుండడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. చౌడుపల్లి చెరువు నుంచి దిగువకు వరద ప్రవహిస్తున్నది. బెన్నవరం పంచాయతీ సుందరకోట వాగు రహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం వల్ల కోరుకొండ వారపు సంత రద్దయింది. తాజంగి జలాశయంలో నీటి ప్రవాహం అధికంగా ఉండడం వల్లవినాయక నిమజ్జనాలకు ప్రజలు వెళ్లొద్దని ఇరిగేషన్ ఏఈఈ లోకేశ్ తెలిపారు.

60 ఎకరాల్లో వరి పంటకు నష్టం

చింతపల్లి మండలంలోని బలపం పంచాయతీ తడ్డపల్లి గ్రామంలో సుమారు 60 ఎకరాలు నీట మునిగాయి. పంట పొలాలు మట్టి, రాళ్లతో నిండిపోయాయి. తడ్డపల్లి గ్రామంలో పంట పొలాలు నీట మునిగిపోయాయి. బెన్నవరం పంచాయతీలో సుందరకోట వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల సుమారు 20 ఎకరాల వరి పొలాలు నీట మునిగిపోయాయి. మండలంలోని అన్నవరం-తమ్మంగుల మార్గంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని బెన్నవరం పంచాయతీ కప్పల గ్రామం వద్ద కల్వర్టు ఆదివారం కొట్టుకుపోయింది. దీంతో సుమారు పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోయపాడు నుంచి కప్పల వెళ్లే మార్గంలో కల్వర్టు ఉన్నది. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో కప్పల గ్రామ సమీపంలోనున్న కల్వర్టు కొట్టుకుపోయింది.

సీలేరులో..

సీలేరు : జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడడంతో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని ఏ.ధారకొండ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి సిరిబాలలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గొల్లపల్లి, తడకపల్లి, పెబ్బంపల్లి గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గొల్లపల్లి గ్రామస్థులు చింతపల్లి వెళ్లడానికి ప్రాణాలకు తెగించి వాగు దాటారు. కాగా భారీ వర్షాలకు గొల్లపల్లిలో సుమారు 25 ఎకరాల వరి పొలాలు నీట మునిగాయని రైతులు తెలిపారు.

డుంబ్రిగుడ : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. చాపరాయి జలవిహారిని కలెక్టర్ ఆదేశాల మేరకు మూసివేశారు. గుంటగన్నేల పంచాయతీ కోరాంజిగుడ గ్రామానికి చెందిన సొమ్మెలి బోల్లు అనే గిరిజనుడి ఇంటిపై జీలుగు చెట్టు కూలి పడడంతో రేకులు ధ్వంసమయ్యాయి. గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామానికి చెందిన వంతాల బాలేశ్వరరావు అనే గిరిజనుడి పెంకుటిల్లు నేలమట్టమైంది. గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో సంపంగి గెడ్డ, కితలంగి కాజ్‌వే, చంపాపట్టి, చాపరాయి, గోరాపూర్ అవతలి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కొయ్యూరు : మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొయ్యూరు మండలంలోని రామరాజుపాలెం వద్ద తాత్కాలిక వంతెన పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రొంపులఘాట్ మీదుగా చింతపల్లికి రాకపోకలకు అంతరాయం కలిగింది. యు. చీడిపాలెం పంచాయతీలో వీరవరం-గొట్లపాడు మధ్య బండిగెడ్డ, బంగారుబంద- సంగంవలస గ్రామాల మధ్య కొండవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పాడేరు రూరల్ : పాడేరులో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 31.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంబేడ్కర్ కూడలి, సినిమాహాలు సెంటర్, మెయిన్ బజారు, పీటీడీ కాంప్లెక్స్ రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. మెయిన్ బజార్, పీటీడీ ప్రధాన రహదారులు జలమయం కావడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బొక్కెళ్ల గ్రామ సమీపంలో మత్స్యగెడ్డ కాజ్‌వేపై నుంచి ఉధృతంగా నీటి ప్రవాహం కారణంగా ఇరడాపల్లి పంచాయతీ బొక్కెళ్ల జంక్షన్ నుంచి ఈ.కొత్తూరు గ్రామం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో రాకపోకలను నిలిపివేశామని ఎంపీడీవో కె.సాయి నవీన్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.


లంబసింగి జంక్షన్ వద్ద ఠాణా మూసివేసి రాకపోకలు నిషేధించిన పోలీసులు

మత్స్యగెడ్డ కాజ్‌వేపై నుంచి ఆదివారం సాయంత్రం నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. అయినప్పటికి సాయంత్ర 6 గంటల సమయంలో విశాఖపట్నం మర్రిపాలేనికి చెందిన ఒక యువకుడు మొండిగా వ్యవహరించి ద్విచక్రవాహనంతో ఆ మార్గంలో వెళ్లేందుకు కాజ్‌వేపై నుంచి ప్రయత్నించాడు. అయితే ప్రవాహం ఉధృతంగా ఉండడంతో అరగంట సేపు గెడ్డ మధ్యలో కాజ్‌వేపై ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక ఇబ్బంది పడ్డారు. చివరకు వాహనంతో పాటు యువకుడు గెడ్డలో కొట్టుకుపోయాడు. దీన్ని గమనిస్తున్న స్థానికులు ఆ యువకుడిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. ద్విచక్రవాహనం మాత్రం గెడ్డలో కొట్టుకుపోయింది. అలాగే.. మరో వ్యక్తి నిత్యావసర వస్తువులను తీసుకొని అదే గెడ్డ దాటే ప్రయత్నం చేశాడు. అతడు గెడ్డలో కొట్టుకుపోతుండగా స్థానికులు అతడిని ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు.

గూడెంకొత్తవీధి : మండలంలోని అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధిలోని పెబ్బెంపల్లి గ్రామంలో వరి పంట పొలాల్లో రాళ్లు, మట్టి పేరుకుపోయాయి. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు ఆదివారం పంట పొలాలపై నుంచి ఉధృతంగా వరద ప్రవహించింది. దీంతో కొండవాగుల నుంచి కొట్టుకుని వచ్చిన రాళ్లు, మట్టి పంట పొలాలపై పేరుకుపోయాయి. కాగా మండలంలోని వంచుల పంచాయతీ చామగెడ్డ వంతెన ఆదివారం మధ్యాహ్నం కూలిపోయింది. అధిక వర్షం వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం చామగెడ్డ వాగుకు పోటెత్తింది. దీంతో వంతెన కూలిపోయింది. దీని వల్ల 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీపీ బోయిన కుమారి, కార్యదర్శి రాజ్యలక్ష్మి, పీఆర్ ఏఈఈ జ్యోతిబాబు కూలిపోయిన వాగును పరిశీలించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీపీ తెలిపారు.


డుంబ్రిగుడ మండలంలోని మొర్రిగుడలో నేలమట్టమైన పెంకుటిల్లు

ముంచంగిపుట్టు : మండలంలో గల 23 పంచాయతీల పరిధిలో వాగులు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల రహదారుల పైనుంచి వరదనీరు ప్రవహించింది. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)కి వెళ్లే మార్గం జలమయమైంది. లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ, దొరగూడ, కర్లాపొదర్, ఉబ్బెంగుల, ముంతగుమ్మి, సుత్తిగూడ తదితర గ్రామాల సమీపంలో మత్స్యగెడ్డ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆంధ్రా, ఒడిశాకు చెందిన సుమారు 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలు కారణంగా మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో వంతాల సహదేవ్ అనే గిరిజనుడి ఇంటి గోడ కూలిపోయింది.

లంబసింగి ఘాట్ రోడ్డు మూసివేత

చింతపల్లి : భారీ వర్షాల నేపథ్యంలో లంబసింగి ఘాట్ రోడ్డు మూసివేసినట్టు స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎస్ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు. ఆదివారం లంబసింగి జంక్షన్‌లోని అటవీశాఖ ఠాణాను మూసివేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాల వల్ల లంబసింగి ఘాట్‌లో కొండచరియలు, వృక్షాలు విరిగిపడే ప్రమాదం ఉన్నదన్నారు. ఈ మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో లంబసింగి ఘాట్‌లో సాయంత్రం ఆరు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఆరు గంటల వరకు రాకపోకలు నిషేధించామన్నారు. ప్రజలు రాత్రి వేళ లంబసింగి ఘాట్ మార్గంలో ప్రయాణించరాదని వారు సూచించారు.


కొయ్యూరు మండలం వీరవరం- గొట్లపాడు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న బండిగెడ్డ

ఘాట్‌రోడ్డులో మట్టిదిబ్బలు.. సత్వరమే తొలగింపు చర్యలు

అనంతగిరి, సెప్టెంబరు 8 : వర్షాల కారణంగా మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డు తోటవలస సమీపంలోని ప్రధాన రహదారిపై ఆదివారం మట్టిదిబ్బలు జారిపడడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అనంతగిరి ఎస్ఐ కరకరాము, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం ఘటనాస్థలానికి చేరుకుని, మట్టిదిబ్బల తొలగింపునకు చర్యలు చేపట్టారు. దీంతో ఘాట్‌రోడ్డులోని యథావిధిగా వాహన రాకపోకలు సాగాయి. ఆర్ఐ శంకరరావు, వీఆర్వో కోటిబాబు, కానిస్టేబులు వైకుంఠ, వీఆర్ఏ పాల్గొన్నారు.

చింతపల్లి : శనివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం మధ్యాహ్నం లంబసింగి ఘాట్ బోడకొండమ్మ ఘాట్ వద్ద కొండచరియలు పడ్డాయి. దీంతో రాకపోకలకు కొంత ఇబ్బంది నెలకొంది. దీంతో


పర్యవేక్షిస్తున్న అధికారులు

ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, తహసీల్దార్ టి.రామకృష్ణ విషయాన్ని ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. దీంతో ఆ శాఖ ఏఈఈ భరతుడు పర్యవేక్షణలో ఎక్స్‌కవేటర్‌తో బండరాళ్లను తొలగించారు.

సంక్షిప్తంగా..

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

» సీఐ హిమగిరి


సిబ్బందితో చర్చిస్తున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, సెప్టెంబరు 8 : గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు సహకరించాలని సీఐ హిమగిరి కోరారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కొరాపుట్టు పాడువ పోలీసు స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. గంజాయి రవాణాపై తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. ఒడిశా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అరకు సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ : గంజాయి రవాణాను సమూలంగా అరికట్టే చర్యల్లో భాగంగా ఒడిశాలోని పాడువ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోతో చర్చించినట్టు అరకులోయ సీఐ హిమగిరి తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు సరిహద్దు రాష్ట్ర పోలీసులతో సమన్వయం చేసుకుంటూ గంజాయి రవాణా అరికట్టే ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. దీంతో సత్ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అరకు ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాదాఘాతంలో పూరిల్లు దగ్ధం

కొయ్యూరు, సెప్టెంబరు 8 : మండలంలోని నల్లగొండ గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో ఓ పూరిల్లు దగ్ధమైంది. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి.

నల్లగొండ గ్రామంలో జంప పార్వతమ్మ ఇంట్లో విద్యుదాఘాతం ఏర్పడడంతో పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోవడంతో పార్వతమ్మ సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలింది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి తోట దొరబాబు బాధితురాలికి నిత్యావసర సరకులతో పాటు రూ.3 వేలు అందజేశారు.

మోదకొండమ్మ ఆలయంలో అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు

పాడేరు రూరల్, సెప్టెంబరు 8 : గిరిజన ప్రాంత ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతానికి ఆలయంలో వారానికి రెండు, మూడు రోజులు అన్నదానాన్ని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు తెలిపారు. దాతల సహకారంతో ఆ కార్యక్రమాన్ని నిత్యాన్నదానంగా మార్పు చేసేందుకు అవసరమైన చర్యలు చేడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

» తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, సెప్టెంబరు 8 : అధిక వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవల కోసం రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాగల మూడు రోజుల పాటు గిరిజన ప్రాంతంలో అధిక వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. అందువల్ల ప్రజలు గృహాల్లోనే ఉండాలన్నారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులతో ఉంటారని, ప్రజలకు ఎటువంటి సహాయం అవసరమైన 7842158626, 7901496495, 8688618687 నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు. గ్రామాల్లో వీఆర్ఏ, వీఆర్వోలు అందుబాటులో ఉన్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.

డుంబ్రిగుడ : వర్షాల నేపథ్యంలో గిరిజన ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగమ్మ సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వాగులు, గెడ్డలు పొంగుతున్నాయన్నారు. వాగులు, గెడ్డలు దాటకుండా గ్రామాల్లోనే సురక్షితంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు. పంట నష్టాలు, ఆస్తి నష్టం జరిగితే ఆర్ఐ హరికి సమాచారం అందించాలని ఆమె సూచించారు.

పండగ పూట విషాదం

» వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు దుర్మరణం

» పాయకరావుపేట మండలంలో ఇద్దరు, రావికమతం మండలంలో ఒకరు..

వినాయక చవితి పండగ పూట జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతిచెందారు. పాయకరావుపేట మండలంలో ఇద్దరు, రావికమతం మండలంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు.



మృతులు తరుణ్‌కుమార్‌స్వామి, రమణ


మృతుడు రామరాజు (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట/రూరల్, సెప్టెంబరు 8 : వినాయక చవితి పండుగ పూట మండలంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. దీంతో మృతుల స్వగ్రామాలైన గుంటపల్లి, రేఖవానిపాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ప్రమాదాలకు సంబంధించి పాయకరావుపేట సీఐ జి.అప్పన్న తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని నామవరం జంక్షన్‌వద్ద నక్కపల్లి నుంచి తుని వైపు వెళుతున్న బొలేరో వాహనం, శనివారం మధ్యాహ్నం అదే దిశలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. దీంతో బొలేరో వాహనం అదుపుతప్పి అవతలి రోడ్డుపైకి దూసుకుపోయి పాయకరావుపేట నుంచి గుంటపల్లి వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలవ్వగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ద్విచక్రవాహనంపై వెళుతున్న గుంటపల్లికి చెందిన సుంకర తరుణ్‌కుమార్‌స్వామి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మిగిలిన వారిని మెరుగైన చికిత్స కోసం కాకినాడ, విశాఖపట్నం ఆస్పత్రులకు తరలించారు. తరుణ్‌కుమార్‌స్వామి తండ్రి, అన్న గత ఏడాది మృతిచెందగా, ఇతను మోటారు మెకానిక్‌గా పనిచేస్తూ తల్లిని పోషిస్తున్నాడు. శనివారం జరిగిన ప్రమాదంతో ఇతను కూడా మృతిచెందడంతో తల్లి ఒంటరైందని బంధువులు తెలిపారు.

కాగా పాయకరావుపేట పట్టణంలోని కనోసా స్కూల్ ఎదుట జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం తుని వైపు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొన్నది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెం గ్రామానికి చెందిన కొల్లాపూర్ రమణ(25) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పన్న తెలిపారు.

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

రావికమతం : మండలంలోని మత్సవానిపాలెం కాటా వద్ద బీఎన్ రోడ్డులో శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన అద్దేపల్లి రామరాజు(28), మత్స రామునాయుడు శనివారం రాతి దొండపూడి వెళ్లి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన కొశిరెడ్డి సువర్ణరాజు, పేరపు శివ అర్జాపురం నుంచి దొండపూడి వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. దారిలో మత్సవానిపాలెం పొల్లుణ కాటా వద్ద ఎదురెదురుగా వచ్చిన బైకులు బలంగా ఢీకొన్నాయి. దీంతో నలుగురూ తీవ్రంగా గాయపడడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామరాజు పరిస్థితి విషమంగా వుండడంతో వైద్యుల సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

ఘాట్‌రోడ్డులో సాయంత్రం 6 తర్వాత బస్సు సర్వీసులు రద్దు

అనంతగిరి, సెప్టెంబరు 8 : ప్రస్తుత కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ఘాట్‌రోడ్డులో సాయంత్రం 6 గంటల తరువాత బస్సులు రద్దు చేస్తున్నట్టు ఎస్.కోట ఆర్టీసీ డీఎం రమేష్ తెలిపారు. దీన్ని ప్రయాణికులు గమనించాలని, వర్షాలు తగ్గిన తరువాత సాయంత్రం ఆరు తరువాత యథావిధిగా బస్సులు రాకపోకలు సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులను నడుపుతున్నామని చెప్పారు.

ఆకట్టుకుంటున్న చాక్లెట్ వినాయకుడు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 8 : మండల పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో సర్వాంగసుందరంగా మండపాలను తయారు చేసి, వివిధ రూపా ల్లో ఉన్న గణపతి ప్రతిమలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద అల్లూరి యూత్ ఆధ్వర్యంలో భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే అదే మండపంలో ఏర్పాటు చేసిన చాక్లెట్ గణపతి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు చాక్లెట్ గణపతిని చూసి మురిసిపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన కొమ్ము సాయికుమార్ అనే భక్తుడు 25 కిలోల బరువు, మూడు అడుగుల పొడుగు ఉన్న చాక్లెట్ గణపతి ప్రతిమను అందించారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే స్థానిక ఐటీడీఏ రెంటల్ క్వాటర్స్ వద్ద హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే జంగంసరియా గ్రామంలో మూడు గ్రామాల ప్రజలు కలిసి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పలు చోట్ల విగ్రహాలను నవరాత్రులు ఉంచుతున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



ముంచంగిపుట్టులో ఏర్పాటు చేసిన చాక్లెట్ గణపతి